క్లుప్తంగా

సుమేధ హైస్కూల్లో రక్షా బంధన్ వేడుకలు



గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో బుధవారం రక్షా బంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థినులు తమ తోటి విద్యార్థులకు రాఖీలు కట్టారు. పాఠశాల డైరెక్టర్ ఎం. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి అక్కా, చెల్లి తమ అన్న, తమ్ముడి క్షేమాన్ని కోరుతూ తమకు జీవితాంతం రక్షగా ఉంటారనే నమ్మకంతో రాఖీ కడతారని తెలిపారు. భారతీయ సంస్కృతిలో ఇది ఒక గొప్ప సంప్రదాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్ద తనిఖీ



గుంటూరు ఎడ్యుకేషన్: రవీంద్రనగర్‌లోని నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో బుధవారం జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని గుంటూరు వెస్ట్–2 ఎంఈవో జ్యోతి కిరణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు స్వయంగా ఆహార పదార్థాల్ని వడ్డించారు. అనంతరం జిల్లా న్యాయ సేవాధికారసంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాపై విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ ప్యానెల్ న్యాయవాది అనిల్‌కుమార్, మానవ అక్రమ రవాణా వ్యతిరేక విభాగ ఏఎస్ఐ బేబీ రాణి, పీఎల్‌ఓ వాసంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏబీ పాలెంలో కేంద్ర బృందం పర్యటన



పెదనందిపాడు: కేంద్ర సెక్రటేరియట్ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల బృందం ఫౌండేషన్ ట్రైనింగ్‌లో భాగంగా గ్రామాల సందర్శన చేపట్టింది. బుధవారం మండల పరిధిలోని అబ్బినేనిగుంటపాలెం గ్రామంలో భారత్ దర్శన్ నిమిత్తం, ఎంజీఎన్ఆర్‌జీఎస్ పథకం కింద ఏర్పాటు చేసిన బ్లాక్ ప్లాంటేషన్, మైక్రోఫిల్టర్, పి.హెచ్. సెంటర్, ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ పథకాల గురించి పెదనందిపాడు మండల ఇన్‌చార్జి ఏపీఓ కె.జ్యోతి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి తెలియజేశారు. సెంట్రల్ టీమ్ సభ్యులు అలోక్ పాండే, అభిషేక్ భక్తి, ఆయుష్ గొయల్, పాలక్ కుమార్ పాండే, ప్రియా వర్మ, రష్మీ చాదురే, నోడల్ ఆఫీసర్ ఎ.శేఖర్ బాబు, పెదనందిపాడు మండలం ఈటీపీఆర్డీ కె.సాయి లీల, గుంటూరు రూరల్ మండలం ఈటీపీఆర్డీ శ్రీనివాసరావు, సర్పంచ్ రావిపాటి కృష్ణప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రావణ సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో మహానేతకు నివాళులర్పిద్దాం



గుంటూరు రూరల్: దివంగత మహానేత, పేదలపాలిట పెన్నిధి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహిద్దామని రూరల్ మండలం జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు పేర్కొన్నారు. బుధవారం గుజ్జనగుండ్లలోని జెడ్పీటీసీ కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత ఆదేశాల మేరకు మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ గ్రామ కన్వీనర్లు, ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ సెప్టెంబర్ 2వ తేదీన మహానేత వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలను గుంటూరు రూరల్ మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ ఒక సైనికుడిలా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో గుంటూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బందలపాటి వెంకటేశ్వరరావు (ఇంద్ర), మండల నాయకులు ఇంటూరి అంజిరెడ్డి, ఎదురుపాక వెంకట్, సర్పంచ్‌లు డబ్బురి సూర్యప్రకాశరావు, తెల్లమేకల మాధవరావు, దొడ్డా రాంజీ, ఎంపీటీసీ సభ్యుడు కాకాని రమేష్, మాజీ మండల ఉపాధ్యక్షుడు దాసరి నాగరాజు, మాజీ సర్పంచ్ చిన్న పలకలూరు తోట నాగేశ్వరరావు, బందలపాటి చిన్నపోతురాజు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌కు పన్ను ‘పోటు’..ఆదాయానికి లోటు

- విలీన గ్రామమైన చౌడవరం పరిధిలో ఓ కోళ్లఫారానికి పదేళ్లుగా పన్ను మినహాయింపు
- ఏప్రిల్ 2021న పన్ను వేసిన రెవెన్యూ అధికారులు
- నగరపాలక సంస్థకు రూ. 1.12 కోట్ల నష్టం
- అధికారులకు నివేదించినప్పటికీ బాధ్యులపై చర్యలు శూన్యం



నగరపాలక సంస్థ కార్యాలయం

నెహ్రూనగర్: శివారు గ్రామాల్లో నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారుల అవినీతి బాగోతాలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి. ప్రధాన ఆదాయ వనరు అయిన పన్నులకు గండికొడుతున్నారు. ప్రతి బిల్డింగ్‌కు, ఖాళీ స్థలాలకు పన్నులు విధించాలని నగర కమిషనర్ చెబుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు ఆదేశాల్ని సైతం లెక్కచేయకుండా కాసులు ఇచ్చిన వారికి పన్నులు వేయకుండా జేబులు నింపుకుంటున్నారు. అండర్ అసెస్‌మెంట్లు(పన్ను వేయాల్సిన దాని కన్నా తక్కువ వేయడం), అన్ అసెస్‌మెంట్(పన్నులు వేయకపోవడం) వంటివి చేస్తూ కార్పొరేషన్ ఆదాయానికి గండి కొడుతున్నారు.

రెవెన్యూ అధికారుల లీలల్లో కొన్ని....

2012లో గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 10 శివారు గ్రామాలు విలీనమయ్యాయి. వీటిల్లో చాలా వాటికి రెవెన్యూ అధికారులు పన్నులు వేయలేదు. ఒకవేళ వేసినా చాలా తక్కువ వేశారు. చౌడవరం పరిధిలో ఓ పెద్ద పౌల్ట్రీ ఫారం(కోళ్ల ఫారం)కు 2012 నుంచి ట్యాక్స్ వేయకుండా నాన్చుడు వ్యవహారం చేశారు. పన్ను వేయనందుకు గాను పౌల్ట్రీ నిర్వాహకులు నెలకు రూ.3లక్షలు ఇచ్చే వారని ఆరోపణలు ఉన్నాయి. అయితే, 2022లో అక్కడికి వేరే రెవెన్యూ ఆఫీసర్ రావడంతో గుట్టు బయటపడింది. ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లి, ఏప్రిల్ 1, 2021 నుంచి పన్ను వేశారు. అధికారుల అవినీతి చర్యల వల్ల నగరపాలక సంస్థకు 1.12కోట్లు ఆర్థిక నష్టం చేకూరింది. చౌడవరం పరిధిలోనే మరో ఐదు కోళ్ల ఫారాలకు ట్యాక్స్ వేయకపోవడం ద్వారా మొత్తంగా నగరపాలక సంస్థకు రూ.1.30కోట్ల ఆర్థిక నష్టం చేకూరిందని సమాచారం. అయితే, ఇందుకు బాధ్యులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

➡ నగరంలోని ఓ ఎయిడెడ్ కాలేజీ, పాఠశాలకు కూడా గత 20 సంవత్సరాల నుంచి పన్ను వేయలేదు. తరువాత మేల్కొన్న రెవెన్యూ అధికారులు 2021 నుంచి పన్ను వేశారు. దీని వల్ల రూ.50లక్షలు దాకా ఆర్థిక నష్టం చేకూరిందని సమాచారం.

➡ చుట్టుగుంట దగ్గరలోని ఓ వ్యాపార సముదాయానికి గతంలో చిన్న గోడౌన్ ఉండేది. దానికి మాత్రమే పన్ను చెల్లిస్తున్నారు. కాలక్రమేణా వెనక అర ఎకరంలో మరిన్ని గోడౌన్లు నిర్మించారు. వాటికి పాత పన్ను వసూలు చేస్తూ కొత్త వాటికి వేయకుండా రెవెన్యూ అధికారులు నాన్చుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ప్రేక్షక పాత్రలో సచివాలయ సిబ్బంది

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 207 వార్డు సచివాలయాలున్నాయి. వాటి పరిధిలోనే అన్ని సేవలు కల్పిస్తున్నప్పటికీ, సచివాలయ సిబ్బంది స్వయంగా నిర్ణయం తీసుకునే అవకాశం రెవెన్యూ అధికారులు ఇవ్వడం లేదు. ట్యాక్స్ వేయాలన్నా, టైటిల్ ట్రాన్స్‌ఫర్ చేయాలన్నా తమ అనుమతితోనే పన్నులు వేయాలని చెబుతుండటంతో సచివాలయ సిబ్బంది పన్నులు వేయకుండా మిన్నకుండిపోతున్నారు. రెవెన్యూ అధికారుల్ని కలవాలని అర్జీదారులకు హితవు పలకడం పరిపాటిగా మారింది.

బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం

నగరపాలక సంస్థకు ఆర్థిక నష్టం చేకూర్చిన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. నగర పరిధిలో అండర్, అన్ అసెస్‌మెంట్ ఉండకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. క్షేత్ర స్థాయి పరిశీలనలో ఎక్కడైనా అవకతవకలు జరిగితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– కీర్తి చేకూరి, కమిషనర్, నగరపాలక సంస్థ

డాక్టర్ సుబ్బారావు సేవలు ఆదర్శనీయం



గుంటూరు మెడికల్ : జిల్లా లెప్రసీ అధికారిగా డాక్టర్ బి.సుబ్బారావు సేవలు ఆదర్శనీయమని డీఎంహెచ్‌వో డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. డాక్టర్ బి.సుబ్బారావు పదవీ విరమణ సభను బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన సేవల్ని కొనియాడారు. ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం డాక్టర్ సుబ్బారావు దంపతులను దుశ్శాలువా, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీపీఎంవో డాక్టర్ సీహెచ్.రత్న మన్మోహన్, వైద్య అధికారి డాక్టర్ లక్ష్మా నాయక్, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయనన్, ఇతర వైద్యాధికారులు, డీపీఎంవోలు, ఏపీఎంవోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

బీఎల్‌వోలకు కలెక్టర్ వేణుగోపాలరెడ్డి ఆదేశం



ఓటర్లు జాబితా పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ఓటర్ల జాబితా నూరు శాతం పారదర్శకంగా సిద్ధమయ్యేలా బీఎల్‌వోలు అత్యంత జాగ్రత్తగా ఓటర్ పరిశీలన చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ఆదేశించారు. బుధవారం నగర తూర్పు ఈఆర్‌వో, కమిషనర్ కీర్తి చేకూరి, పశ్చిమ ఈఆర్‌వో, అదనపు కమిషనర్ పెద్ది రోజా, ఏఈఆర్‌వోలతో కలసి 94 గుంటూరు పశ్చిమ, 95 గుంటూరు తూర్పు నియోజకవర్గాల్లోని ఎల్‌ఐసీ కాలనీ, తుఫాన్ నగర్, అశోక్ నగర్, కొత్తపేట తదితర ప్రాంతాల్లో డోర్ టు డోర్ ఓటర్ సర్వేలో అందిన అర్జీలతో పాటు 2022 నుంచి తొలగించిన ఓట్ల రీవెరిఫికేషన్ వివరాలను కలెక్టర్ నేరుగా పరిశీలించారు. అర్జీదారులు, ఓటర్లతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఇంటింటి ఓటర్ సర్వే పూర్తయిందని తెలిపారు. సర్వేలో అందిన అర్జీలు, ఫారాలు ఆన్‌లైన్ చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రతి బీఎల్‌వో తన పరిధిలో ఓటర్ల లిస్టు సమగ్రంగా, పారదర్శకంగా ఉండేలా బాధ్యత తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రతి ఓటు తొలగింపు, మార్పు, చేర్పులను సూపర్‌వైజరీ అధికారులు నేరుగా తనిఖీ చేసిన తర్వాతనే ఆమోదించాలని చెప్పారు. ఎన్నికల విధుల్లో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, నిర్లక్ష్యంగా ఉంటే సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణలో భాగంగా ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చనిపోయిన వారి ఓట్లు, బదిలీ ఓట్లు, ద్వంద ఓట్లు, నూతన ఓటర్ల నమోదు వివరాలను బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. అర్జీలు తీసుకున్న తర్వాత సూపర్‌వైజరీ అధికారులు నేరుగా తనిఖీ చేసి సిఫార్స్ చేయాలని ఆదేశించారు. ప్రతి అర్జీ ఆమోదం అయ్యే ముందు బీఎల్‌వో, సూపర్వైజరీ అధికారులు సంతకాలు చేయాలని కలెక్టర్ చెప్పారు. డెత్ ఓట్ల తొలగింపుకు తప్పనిసరిగా సర్టిఫికెట్ అప్ లోడ్ చేయాలని, షిఫ్ట్ ఓట్లను వారి ఆమోదం ద్వారానే చేయాలని సూచించారు. 2022 నుంచి ఇప్పటి వరకు తొలగించిన ఓట్లను మరొకమారు పునఃపరిశీలన చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సీహెచ్.శ్రీనివాస్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, ఎమ్మార్వోలు, సూపర్వైజరీ అధికారులు పాల్గొన్నారు.

హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవ పోటీల్లో హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం తెలిపారు. అమరావతి రోడ్డులోని కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలుగు పద్యాల ఉచ్చారణ విభాగంలో ఫార్మాడీ ఐదో ఏడాది విద్యార్థిని ఎస్. శ్రీవర్ధిని ప్రథమ స్థానం కైవసం చేసుకుందని తెలిపారు. కేరమ్స్ డబుల్స్ విభాగంలో ఎం.ఫార్మసీ విద్యార్థినులు ఆర్.జయంతి, కె.మేఘన, కేరమ్స్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో ఆర్.జయంతి, టి.అక్షయ్ కలసి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్ని కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ఫార్మాడీ డైరెక్టర్ డాక్టర్ పి. సీతారామయ్య, ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్. అజిత్‌బాబు, అధ్యాపకులు అభినందించారు.

లైంగిక దాడుల్ని ధైర్యంగా ఎదుర్కోవాలి

గుంటూరు లీగల్: బాలబాలికలు తమపై జరుగుతున్న లైంగిక దాడుల్ని ధైర్యం ఎదుర్కోవాలని, దురాగతాల్ని వెంటనే స్థానిక ఎంఈవో లేదా వారి పాఠశాల ఉపాధ్యాయులకు తెలియజేయాలని గుంటూరు వెస్ట్ ఎంఈవో జ్యోతి కిరణ్ సూచించారు. హైకోర్టు ఆదేశాల మేరకు డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో స్తంభాలగరువులోని చేబ్రోలు మహాలక్ష్మి, పుల్లయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూలులో బుధవారం విద్యార్థులకు బాలల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఈవో జ్యోతి కిరణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లిపెద్ది శ్రీనివాసరావు సభకు అధ్యక్షత వహించారు. ఎంఈవో జ్యోతి కిరణ్ మాట్లాడుతూ బాలలు ఆత్మవిశ్వాసంతో జీవిస్తూ, ఆత్మరక్షణ చేసుకోవాలని సూచించారు. బచపన్ బచావో కో–ఆర్డినేటర్ తిరుపతిరావు మాట్లాడుతూ ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తున్నారని అర్థం చేసుకున్న వెంటనే అరవడం లేదా చుట్టుపక్కల వారికి చెప్పాలని సూచించారు. ఏఎస్ఐ బేబీ రాణి మాట్లాడుతూ పిల్లలు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. డీఎల్ఎస్ఏ ప్యానల్ అడ్వకేట్ అనిల్‌కుమార్ పిల్లలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీగల్ కమ్ ప్రొహిబిషన్ అధికారి వాసంతి, పఠాన్ మొహిద్దీన్ ఖాన్, పారా లీగల్ వలంటీర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రవీంద్ర నగర్‌లోని పీఎంసీ ఉన్నత పాఠశాలలో..

రవీంద్ర నగర్‌లోని పీఎంసీ ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే మంచి లక్షణాలు అలవర్చుకుని, ఉత్తమ పౌరులుగా ఎదగాలని డీఎల్ఎస్ఏ ప్యానల్ అడ్వకేట్ అనిల్ కుమార్ సూచించారు. కార్యక్రమంలో పీఎల్‌వో వాసంతి పాల్గొన్నారు.

అర్ధరాత్రి మద్యం అమ్మితే కఠిన చర్యలు

సాక్షి ఎఫెక్ట్

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రులు మద్యం అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తపేట పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వో షేక్ అన్వర్ బాషా స్పష్టం చేశారు. సాక్షి లో బుధవారం ప్రచురితమైన అర్ధరాత్రులు బార్‌లు తెరిచారు౯ అనే కథనానికి స్పందించారు. కొత్తపేట పీఎస్‌లో బుధవారం సాయంత్రం బార్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ అన్వర్ బాషా మాట్లాడుతూ నియమ, నిబంధనలకు విరుద్ధంగా రాత్రి 11 గంటల తరువాత మద్యం విక్రయాలు జరిపితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉదయం కూడా ప్రభుత్వం సూచించిన సమయంలోనే బార్‌లు తెరవాలని తేల్చి చెప్పారు. దీంతోపాటు మైనర్‌లకు మద్యం విక్రయిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. పూర్తి స్థాయిలో నిబంధనలకు లోబడి వ్యాపారాలు నిర్వహించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బార్ల పరిసర ప్రాంతాల్లో ఘర్షణలు, వివాదాలకు తావు లేకుండా యాజమాన్యం చూసుకోవాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ రాత్రి 11 గంటలకు బార్‌లు మూసివేయాలని ఆయన ఆదేశించారు.



బార్ యజమానులు, మేనేజర్లతో మాట్లాడుతున్న ఎస్‌హెచ్‌ఓ అన్వర్‌బాషా

‘ఆడుదాం ఆంధ్రా’ యువతకు మంచి అవకాశం

నగర కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: క్రీడలపై ఆసక్తి కలిగిన యువతకు ఆడుదాం ఆంధ్రా ద్వారా మంచి అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని, నగర యువత సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కీర్తి చేకూరి సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అక్టోబర్ 2 నుంచి జరగనున్న ఆడుదాం ఆంధ్రాలో 15 ఏళ్ల పైబడిన వారంతా పాల్గొనవచ్చని ఆమె తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బ్యాడ్మింటన్ విభాగాల్లో గ్రామ, వార్డు సచివాలయాల స్థాయి నుంచి మండల, అసెంబ్లీ నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకూ పోటీల్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆయా స్థాయిల్లో నగదు బహుమతులు కూడా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. గుంటూరు నగర పరిధిలో సుమారు 3 లక్షల మంది క్రీడల్లో పాల్గొనే అవకాశం ఉందని ఆమె తెలిపారు. వార్డు సచివాలయాల పరిధిలో అడ్మిన్, ఎడ్యుకేషన్ కార్యదర్శులు క్రీడలపై ఆసక్తి ఉన్న వారి నుంచి వివరాలు తీసుకొని ఆన్‌లైన్ చేయాలని, ప్రతి క్రీడాకారునికి అకనాలెడ్జ్ కూడా ఇవ్వాలని కమిషనర్ ఆదేశించారు. క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగం పొందిన వారు ఆడేందుకు అవకాశం లేదని, వారిని క్రీడల నిర్వహణ, సూచనలకు వినియోగించుకుంటామని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన వారికి రూ.20వేలు, రన్నర్స్‌కు రూ.10 వేలు, జిల్లా స్థాయిలో గెలుపొందిన వారికి రూ.50 వేలు, రన్నర్స్‌కు రూ.30 వేలు, రాష్ట్ర స్థాయిలో విజేతలకు రూ.5 లక్షలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.3 లక్షలు, తృతీయ స్థానం సాధించిన వారికి రూ.2 లక్షలు నగదు బహుమతులు అందించనున్నట్లు వెల్లడించారు. నగర యువత పెద్దఎత్తున పోటీల్లో పాల్గొని గుంటూరు నగరానికి రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావాలని కమిషనర్ ఆకాంక్షించారు.

చైనా, పాకిస్థాన్‌ల నుంచి పొంచిఉన్న ప్రమాదం



సమావేశంలో మాట్లాడుతున్న విద్యావేత్త, విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య, పక్కన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: స్వదేశంలో పరిస్థితుల బాగోలేనప్పుడు పొరుగు దేశాలపై విరుచుకుని పడటం పాకిస్థాన్, చైనాలు అనుసరిస్తున్న వైఖరిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని విద్యావేత్త, విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో మేధావుల చర్చాగోష్ఠిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరయ్య మాట్లాడుతూ చంద్రయాన్–3 మిషన్ విజయవంతం కావడంతో ఆనందంతో ఉన్న భారత్‌ను మానసికంగా దెబ్బతీయడానికి చైనా కుట్ర చేస్తోందని తెలిపారు. 2023 చైనా ఎడిషన్ పేరుతో ఒక మ్యాప్ కూడా విడుదల చేసిందన్నారు. పాకిస్థాన్ కూడా చైనా బాటలో నడుస్తూ భారత్‌పై కత్తులు నూరుతోందని తెలిపారు. చైనా, పాకిస్థాన్‌ల నుంచి ప్రమాదం పొంచి ఉందని, భారత్ అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సీహెచ్. ప్రసాద్ మాట్లాడుతూ చైనా అంతర్గత పరిస్థితులు ఏమంత సానుకూలంగా లేవని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో పొరుగు దేశంపై విరుచు పడటం ద్వారా స్వదేశంలో ప్రజల అభిమానాన్ని చూరగొనాలన్నది చైనా అధ్యక్షుడి వ్యూహంగా కన్పిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, మేధావులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

స్నాతకోత్సవంలో నగర విద్యార్థులకు పతకాలు



విద్యార్థినులతో ప్రిన్సిపాల్ అనితాదేవి



ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్ నుంచి బంగారు పతకం అందుకున్న అక్షితా జైన్

గుంటూరు ఎడ్యుకేషన్: ఏఎన్‌యూలో మంగళవారం జరిగిన స్నాతకోత్సవంలో టీజేపీఎస్ పీజీ కళాశాల విద్యార్థినులు ఐదు బంగారు పతకాలు అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. అనితాదేవి తెలిపారు. పట్టాభిపురంలోని కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎంకాంలో ఎం. పద్మినిసాహు యూనివర్సిటీ పరిధిలో అత్యధిక మార్కులు సాధించడంతో పాటు అన్ని సబ్జెక్టుల్లో అధిక మార్కులు, ఆర్ట్స్ కళాశాల పరిధిలో అధిక మార్కుల సాధనకు గాను మూడు బంగారు పతకాలను సాధించినట్లు వివరించారు. మరో విద్యార్థిని ఎం. మౌనిక ఎమ్మెస్సీ ఫిజిక్స్‌లో యూనివర్సిటీ స్థాయిలో అత్యధిక మార్కుల సాధనకు గాను రెండు బంగారు పతకాలను సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినుల్ని కళాశాల కరస్పాండెంట్ కె.వి.బ్రహ్మం, ఎంకాం, ఎమ్మెస్సీ విభాగాధిపతులు డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు, డాక్టర్ చంద్రశేఖర్, అధ్యాపకులు అభినందించారు.

➡ ఏఎన్‌యూలో మంగళవారం జరిగిన స్నాతకోత్సవంలో బీహెచ్ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు బంగారు పతకాలు కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బి. కౌసల్యాదేవి తెలిపారు. బ్రాడీపేటలోని కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమలో ఆమె మాట్లాడారు. బీకాం విభాగంలో ఓవరాల్ టాపర్‌గా నిలిచిన అక్షితాజైన్, బీకాం అకౌంటింగ్‌లో పూజా జైన్, బీఎస్సీ బోటనీలో దేవిశెట్టి అంకిత బంగారు పతకాలను సాధించి కళాశాలకు గర్వకారణంగా నిలిచారని పేర్కొన్నారు. కళాశాల కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీవీ విజయభాస్కర్ మాట్లాడుతూ ఒకే విద్యాసంవత్సరంలో ముగ్గురు విద్యార్థినులు బంగారు పతకాలు సాధించడం కళాశాల విద్యాప్రగతికి నిదర్శనమని తెలిపారు. కళాశాల కార్యదర్శి చేగు శ్రీధర్ మాట్లాడుతూ ఉన్నత విలువలతో కూడిన విద్యను అందించడంలో గత 33 ఏళ్లుగా చేస్తున్న కృషికి గుర్తింపుగా తమ విద్యార్థినులు యూనివర్సిటీ స్థాయిలో ఎన్నో బంగారు పతకాలను కైవసం చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఏ.రాధామాధవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాలికలకు ఆత్మరక్షణ నైపుణ్యాలు అవసరం



తోటి విద్యార్థికి రాఖీ కడుతున్న విద్యార్థిని

గుంటూరు ఎడ్యుకేషన్:అనుకోని పరిస్థితులు ఎదురైన సమయంలో బాలికలు తమను తాము రక్షించుకునేందుకు ఆత్మరక్షణ నైపుణ్యాల్ని పెంపొందించుకోవాలని గుంటూరు వెస్ట్ ఎంఈవో–2 జ్యోతి కిరణ్ సూచించారు. స్తంభాలగరువులోని చేబ్రోలు మహాలక్ష్మి–పుల్లయ్య నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థినులకు మానవ అక్రమ రవాణా–ఆత్మరక్షణ నైపుణ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో జ్యోతి కిరణ్ మాట్లాడుతూ విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో జీవించాలని తెలిపారు. బచ్‌పన్ బచావో సమన్వయకర్త తిరుపతిరావు మాట్లాడుతూ మంచి స్పర్శ, చెడు స్పర్శకు తేడా తెలుసుకోవాలని తెలిపారు. సమాజంలో మన చుట్టూ తిరిగే బాగా తెలిసిన వ్యక్తులే ఎక్కువగా అరాచకాలకు పాల్పడుతున్నారని, ఎప్పుడైతే వారు బ్యాడ్ టచ్ చేస్తున్నారని అర్థమవుతుందో, తక్షణమే వారి నుంచి దూరంగా వెళ్లిపోవాలని సూచించారు. ప్రస్తుతం మానవ అక్రమ రవాణా ఎక్కువగా జరుగుతోందని, చిన్న పిల్లల్ని అక్రమంగా తరలించి వారి జీవితాల్ని నాశనం చేస్తున్నారని పేర్కొన్నారు. పిల్లలు తమ తల్లిదండ్రులు చెప్పిన విధంగా నడుచుకుంటూ సోషల్ మీడియాకి దూరం పాటించాలని సూచించారు. అపరిచిత వ్యక్తులతో పరిచయాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఏఎస్ఐ బేబీరాణి మాట్లాడుతూ విద్యార్థినులు చదువులో పోటీ పడి, వ్యక్తిత్వాన్ని కాపాడుకోవాలని సూచించారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని విద్యార్థినులతో విద్యార్థులకు రాఖీలు కట్టించారు. కార్యక్రమంలో లీగల్ కమ్ ప్రొబిషన్ అధికారి వాసంతి, ప్యానెల్ న్యాయవాది, అనిల్ కుమార్, లీగల్ వలంటీర్ పఠాన్ మొహిద్దీన్ ఖాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లిపెద్ది శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివనాగిరెడ్డికి ప్రతిభా పురస్కారం

తెనాలి: వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్న ప్రముఖులకు హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం బుధవారం 2021 సంవత్సరానికి ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేసింది. ఇందులో భాగంగా తెనాలికి చెందిన ప్రముఖ స్థపతి డాక్టర్ ఈమని శివనాగిరెడ్డికి, శిల్పకళారంగంలో ప్రతిభా పురస్కారం బహూకరించింది. శిల్పకళలో శిక్షణ పొంది అనేక ప్రాచీన ఆలయాల పునరుద్ధరణ, కొత్త ఆలయాల నిర్మాణంలో గత 45 ఏళ్లుగా చేస్తున్న కృషికి ఈ గుర్తింపును అందజేశారు. విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెళ్ల కిషన్‌రావు అధ్యక్షత వహించిన సభలో ఎస్వీ యూనివర్సిటీ మాజీ కులపతి, ప్రసిద్ధ సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ చేతులమీదుగా శివనాగిరెడ్డికి పురస్కారం ప్రదానం చేశారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

పెదనందిపాడు: యువతి కనిపించకుండా పోయిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. పెదనందిపాడుకు చెందిన యువతి బుధవారం ఉదయం నుంచి కనిపించడం లేదు. బంధువుల ఇళ్లల్లో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో సాయంత్రం పెదనందిపాడు పోలీస్ స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కేంద్రియ విద్యాలయంలో కళాఉత్సవ్ పోటీలు



సంప్రదాయ నృత్య పోటీలలో విద్యార్థినులు

గుంటూరు రూరల్: నల్లపాడు కేంద్రియ విద్యాలయంలో హైదరాబాద్ రీజియన్ కేంద్రియ విద్యాలయాల కళా ఉత్సవ్ కార్యక్రమాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ 2023 క్లస్టర్ స్థాయి కళ, నృత్యం, సంగీత పోటీలను నిర్వహించారు. విద్యార్థుల ప్రతిభను చాటేందుకు క్లస్టర్ స్థాయి 3డీ ఆర్ట్, గ్రూప్, సోలో డ్యాన్స్, డ్రామా, క్లాసికల్, సంప్రదాయ, జానపద సంగీతం, పెయింటింగ్, బొమ్మల తయారీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో తొమ్మిది కేంద్రియ విద్యాలయాల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రదర్శనలను 15 మంది ప్రముఖ న్యాయనిర్ణేతలు పర్యవేక్షించి విజేతలను ఎంపిక చేశారు. విజేతలను ప్రశంసాపత్రాలతో సత్కరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ హనీ మెహత, హెచ్ఎం ఆనంద్, సునీల, టి.లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.